క్లుప్తంగా

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని తూడుకుర్తిలో రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పలు గ్రామాల రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, వ్యవసాయ మండల అధికారి రాజు, కాంగ్రెస్ నాయకులు అబిబ్, కోటయ్య పాల్గొన్నారు.

కల్తీకల్లును అరికట్టాలని కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్: తమ గ్రామంలో విచ్చలవిడిగా అమ్ముతున్న కల్తీకల్లును అరికట్టాలని కోరుతూ బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, గురుస్వామి, శివతోపాటు పలువురు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ బదావత్‌సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరుమందికి పైగా టీఎఫ్‌టీ లైసెన్స్‌లు తెచ్చుకుని వాటిపేరిట విపరీతంగా కల్లువిక్రయిస్తున్నారని, మండలంలోగాని, గ్రామంలోగాని ఎక్కడా తాటి, ఈత చెట్లు లేకుండా కల్లును విక్రయిస్తున్నారని తెలిపారు. పిల్లలు, ముసలివారు కల్లుకు బానిసలుగా మారుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే స్పందించి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

దాడిని ఖండిస్తున్నాం

కందనూలు: ఏబీవీపీ సిద్ధిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్యపై కమ్యూనిస్టుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారుబాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, లేని పక్షంలో ఉద్యమం చేస్తామన్నారు.

నూతన అధ్యక్షుడి ఎన్నిక

తిమ్మాజీపేట: అప్పాజిపల్లి నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎన్నిక పార్టీ సీనియర్ నాయకుడు చిలుక వివేక్‌రెడ్డి, చిలుక ఎల్లారెడ్డి, చిలుక భాస్కర్‌రెడ్డి, చంద్రమౌలిగౌడ్, జిల్లి వెంకటయ్య, అప్పల మల్లేష్‌ల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా చిలుక అంజన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పోతురపల్లి తిరుపతయ్య, కోశాధికారిగా అప్పల మల్లేష్, కేశంపెట శ్రీనులను ఎన్నుకున్నారు.వారితో పాటు సభ్యులుగా ఏడుగురిని ఎన్నుకున్నారు. అప్పాజిపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా చందు,కోశాధికారిగా కేశంపేట శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పట్టభద్రులకు శిక్షణ

బిజినేపల్లి: వ్యవసాయ రంగాల్లో పారిశ్రామికవేత్తలుగా ఏదగాలనుకునే నిరుద్యోగ యువ పట్టభద్రులకు ఐసీఎంఆర్– భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థల ఆధ్వర్యంలో జూన్ 30వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో ఆయిల్ ప్రాసెసింగ్, భూసార పరీక్షా కేంద్రం, విత్తనోత్పత్తి, సేంద్రియ ఎరువుల తయారీ వంటి వాటిపై శిక్షణ కల్పిస్తారని, పెట్టుబడి రుణాలు, సబ్సిడీ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 8247371710, 9398319106 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బ్యాగును అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది



కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి మండలం యాపట్లకు చెందిన కేశమ్మ సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి యాపట్లకు వస్తూ బస్సులో బ్యాగు మర్చిపోయింది. నాగర్‌కర్నూల్‌లో బస్సు దిగి బాత్రూంకు వెళ్లింది. కొద్దిసేపటికి ఆమె వచ్చేసరికి బస్టాండ్‌లో బస్సు కనిపించలేదు. దీంతో ఆమె మరో బస్సు ఎక్కి కొల్లాపూర్ బయలుదేరి, కండక్టర్ సాయిగీతకు తాను హైదరాబాద్–2 డిపో బస్సులో బ్యాగు మర్చిపోయినట్లు చెప్పింది. కండక్టర్ కొల్లాపూర్ బస్టాండ్ కంట్రోలర్‌కు ఫోన్‌చేసి వివరాలు చెప్పింది. కొల్లాపూర్ బస్సురాగానే బ్యాగును కంట్రోలర్ తీసుకొని తర్వాత కేశమ్మకు అందజేశారు. బ్యాగులో 52తులాల వెండి ఆభరణాలు ఉన్నట్లు కేశమ్మ తెలిపింది.

నామినేటెడ్ పనులకే ప్రాధాన్యం

అచ్చంపేట: మున్సిపల్ సర్వసభ్య సమావేశం అంత్యంత రహస్యంగా నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అధ్యక్షతన సోమవారం 3గంటలకు పైగా కొనసాగిన సమావేశంలో 2024–25 సంవత్సరంలో చేపట్టిన పనులు, నిధుల ఖర్చుపై కౌన్సిలర్లు ప్రశ్నలు లేవనెత్తినట్లు తెలిసింది. రూ.1కోటికి పైగా నిధుల అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు గుప్పించారు. ఎజెండాలో పేర్కొన్న పనులు కేటాయింపులన్నీ కేవలం నామినేటెడ్ పనులకు ప్రాధాన్యం కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదయ్య, కౌన్సిలర్లు గౌరిశంకర్, సునీత, మనుప్రసాద్, అంతటి శివ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే



వెల్దండ మండల కేంద్రంలో రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే వెల్దండ రైతు వేదికలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పంట కాలానికి రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమ చేస్తుందన్నారు. అధికారులు అందించే సలహాలు,సూచనలు రైతులు పాటించాలన్నారు.

బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ..

వెల్దండ మండలంలోని గొల్లోనిపల్లి–మర్రిగుంత తండా వరకు మంజూరైన బీటీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులను నాణ్యతగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం బీటీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బాలాజీసింగ్, అధికారులు బాలు, వెంకటేశ్వర్‌సింగ్, బస్వలింగం, కిరణ్‌కుమార్, లక్ష్మణ్, ఏఓ శోభారాణి, సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బైరాపూర్ గ్రామంలో పల్లె దవాఖాన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం రూ.20 లక్షలతో దవాఖానను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి, మట్ట వెంకటయ్యగౌడు, మోతిలాల్‌నాయక్, సంజీవ్‌కుమార్, పర్వత్‌రెడ్డి, రాజుయాదవ్, జయప్రకాష్, హరికిషన్‌నాయక్, కృష్ణ, దుబ్బతండా శ్రీనునాయక్, రషీద్, తిరుపతి రెడ్డి, డాక్టర్ సింధు, వైద్య సిబ్బంది ఉన్నారు.

విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

బిజినేపల్లి: అర్హులందరికి ఒకేసారి కాకుండా విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కారుకొండ, బిజినేపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి కారుకొండ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలరాజు, మల్లేష్, అమృత్‌రెడ్డి, శ్రీనివాసులు, మిద్దెరాములు, కత్తె ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తెలకపల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. దాసుపల్లి రైతువేదికలో రైతులతో ముఖాముఖి ద్వారా సీఎం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వానాకాలం ప్రతి రైతుకు రైతుభరోసా అందుతుందన్నారు. అనంతరం పెద్ద ఎత్తున మండలంలోని ఆయా గ్రామాల రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖాముఖిని వీక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, సింగిల్ విండో వైస్ మామిళ్లపల్లి యాదయ్య, రాజమహేందర్‌రెడ్డి, రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

అర్హులందరికీ ఇళ్లు

అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి తెలిపారు. తెలకపల్లిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసి ప్రారంభించారు. లబ్ధిదారులు త్వరిత గతిన ఇంటి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ప్రధాన కూడళ్లను సుందరీకరించండి



ఆర్‌ఓ కృష్ణప్రసాద్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: 167కే నేషనల్ హైవే లోని ప్రధాన కూడళ్లను సుందరీకరించాలని ఎన్‌హెచ్‌ఏఐ తెలంగాణ ఆర్‌ఓ కృష్ణప్రసాద్‌ను కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో కృష్ణప్రసాద్‌ను కలిశారు. కొల్లాపూర్ పట్టణం సమీపంలోని ఇందిరాగాంధీ చౌరస్తా, చౌటబెట్లకు వెళ్లే రోడ్డులో, సోమశిలకు వెళ్లే దారిలోని చౌరస్తాలను అభివృద్ధి పర్చాలని కోరినట్లు ఆయన తెలిపారు. చౌరస్తాల సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు, సైడ్ లైటింగ్, సిగ్నల్స్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రోడ్డు పక్కనే ఉన్న పంటపొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన రహదారిని లెవల్ చేయాలని కోరినట్లు వివరించారు. రోడ్డు నిర్మాణ ప్రాంతంలో భూములు, ప్లాట్లు కోల్పోయిన కొంతమందికి పరిహారం అందజేయలేదని, వాటిపై దృష్టిసారించాలని వివరించినట్లు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట కొల్లాపూర్ మాజీ మార్కెట్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు వెంకటకృష్ణారెడ్డి, తదితరులున్నారు.

పెద్దకొత్తపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బండ్ల నర్సింహ

పెద్దకొత్తపల్లి: మండల మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ దండు నర్సింహను ఎంపిక చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దండు నర్సింహ మండల కేంద్రంలో 2006లో ఎంపీటీసీగా ఐదు సంవత్సరాలు కొనసాగారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దండు నర్సింహను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తగిలి కృష్ణయ్య, మైసమ్మ దేవాలయం చైర్మన్ శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ గౌరమ్మ, చంద్రయ్యలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుభ్రతను పాటిస్తేనే ఆరోగ్యం

ఉప్పునుంతల: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యంగా జీవించగల్గుతామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్న సూచించారు. సోమవారం స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రత, ఓఆర్‌ఎస్‌తో నీళ్ల విరేచనాలు ఏవిధంగా నియంత్రించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

కోడేరు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఇంటర్మీడియేట్‌లో చేరేందుకు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. ఇంటర్‌లో ఏఐఎంఎల్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్, మిషన్‌లెర్నింగ్ కోర్సుల్లో పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఏఐఎంఎల్, పీజీసీఆర్‌టీ ఇంగ్లిష్ గెస్ట్ ఫ్యాకల్టీగా బోధించుటకు రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, బీఈ, బీటెక్ కంప్యూటర్ అర్హత సాధించి ఉండాలన్నారు. 20వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి సమాచారం కోసం 9100173412ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్మీడియట్ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఇంగ్లిష్ మీడియం) కోర్సులలో తెలుగు, ఇంగ్లిష్, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్, నర్సింగ్ సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన వారిని గెస్టు ఫ్యాకల్టీ కింద నియమించనున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ సైదా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి అనుభవం కల్గిన మహిళా అభ్యర్థులు ఈనెల 17వ తేదీ సాయంత్రం వరకు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



తెలకపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని తహసీల్దార్ జాకీర్ అలీ, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌతంపల్లి ప్రాథమిక పాఠశాలలో దుస్తులు, పుస్తకాలు, సామగ్రిని పంపిణీ చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని చెర్కూర్, భర్కత్‌పల్లి, కొర్దువాడతండా గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజనికాంత్, పావని, లక్ష్మణ్, సీఆర్పీ అంజ్యనాయక్, మాజీ సర్పంచ్ పత్యనాయక్ ఉన్నారు.

విద్యావిధానంలో సమూల మార్పులు

- విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్



చారకొండలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేష్

చారకొండ: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి, ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించి, పాఠశాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులతో కలిసి చర్చించారు. విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యాంశాలను చదివించి, విద్యార్థులను సామర్థ్యాలను తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు సంఖ్య తదితర సౌకర్యాలపై హెచ్‌ఎం భగవాన్‌రెడ్డి వివరించారు. పాఠశాలలో సమస్యలు ఆర్‌ఓఆర్ ప్లాంట్, ప్లే గ్రౌండ్, మూత్రశాలలు తదితర వాటిని వివరించారు. దృష్టికి వచ్చిన సమస్యలపై ఉన్నత అధికారులు, ప్రభుత్వంతో చర్చించి త్వరలో పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చారకొండ సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

విద్యాకమిషన్ సభ్యుడికి సన్మానం

చారకొండ: మండల కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాగూర్ బాలాజీ సింగ్‌లను మండల కేంద్రంలో సోమవారం సింగిల్ విండో చైర్మన్ జెల్ల గుర్వయ్యగౌడ్ ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాండు, మల్లేష్, ఆనందం, సైదులు, రవిచారి, చంద్రశేఖర్, ఆంజనేయులు, రామస్వామి ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

చారకొండ: మండల కేంద్రంలో శ్రీలక్ష్మీపద్మావతి వేంకటేశ్వరస్వామి దేవాలయం వార్షికోత్సం పురస్కరించుకోని సోమవారం స్వామి వారి కల్యాణోత్సవం ఆలయ కమిటీ అధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేడుకల్లో దేవాలయ కమిటీ బృదం, విద్యాకమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్, మాజీ జడ్పీవైస్ చైర్మన్ బాలాజీ సింగ్, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాల్‌రాంగౌడ్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొని కల్యాణ వేడుక తిలకించారు. కల్యాణ వేడుకలను మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన చిలకాని జైపాల్‌రెడ్డి, సరిత నిర్వహించారు. భక్తులకు కుకుడాల కృష్ణయ్య, లక్ష్మమ్మ దంపతులు అన్నదానం చేశారు.



చారకొండ కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

11కేవీ లైన్ పనులు నిలిపేయాలని ధర్నా



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

కోడేరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో 11కేవీ విద్యుత్ లైన్ పనులు నిలిపేయాలని కాలనీ వాసులు సోమవారం సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ 30ఏళ్ల నుంచి 11కేవీ విద్యుత్ లైన్ ఇండ్లపై ఉండటంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే వాటిని మార్చాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా లాభం లేకుండా పోయిందన్నారు. ఈ విషయం మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో 11కేవీ లైన్ మార్చాలని విద్యుత్ అధికారులకు తెలియజేసినా అధికారులు పట్టించుకోకుండా మళ్లీ కాలనీ నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించకపోతే డీఈ కార్యాలయం ముందు ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆది కొమ్ము దానయ్య, శరత్, మిద్దె రామకృష్ణ, ఆది సోమనాథ్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రా రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తి రూరల్: రా రైస్ మిల్లర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని రైస్ మిల్లర్స్ అన్నారు. చిన్న మిల్లులపై చిన్న చూపు తగదన్నారు. సీఎంఆర్ తో పాటు ప్రభుత్వం నుంచి రైస్ మిల్లర్లకు రావాల్సిన అవకాశాలు రావడం లేదన్నారు. సోమవారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొల్లాపూర్ రైస్ మిల్లర్స్ నాయకులు నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్న మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం మిల్లర్లు అందరూ ఏకమై చర్చించి పరిష్కారం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని నవీన్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో డివిజన్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీచని బాలకష్ణ, ప్రధాన కార్యదర్శి పోల విజయకుమార్, కోశాధికారి కొట్టాల గడ్డ రవి, పూల ఏకనాథం, తదితరులతోపాటు రైస్ మిల్లర్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

క్లోరినేషన్‌ను నిరంతరం చేపట్టాలి

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో ఇళ్లకు అందించే నీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్‌తో పాటు నీటి నాణ్యతను నిరంతరం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు నీటి ట్యాంకులతో పాటుగా ఇంటింటికి అందించే నీటిని క్లోరినేషన్ చేసే కార్యక్రమాన్ని ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రస్తుత వానాకాలంలో వర్షపునీటితో పాటుగా, మురుగు, వాన నీరు కలిసే అవకాశం ఉండటంతో వాటర్ లైన్‌మెన్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మున్సిపాలిటీలో ఉన్న వాటర్ కనెక్షన్ వివరాలను ఆన్‌లైన్ చేయాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా కొనసాగించాలని ఆయన ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ షబ్బీర్, వార్డు ఆఫీసర్ శోభ, వాటర్ లైన్‌మెన్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



నీటి క్లోరినేషన్ పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, ఏఈ షబ్బీర్

బస్‌పాస్‌ల ధర పెంపు తగదు

కల్వకుర్తి రూరల్: బస్‌పాస్ చార్జీల పెంపు ద్వారా పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనని ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కల్వకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువు కోసం ఆర్టీసీ బస్సుల ద్వారా వివిధ ప్రాంతాలకు, పట్టణాలకు వెళ్లి చదువు కొనసాగిస్తున్నారన్నారు. బస్‌పాస్ చార్జీల పెంపుతో వారిపై ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వ నిర్ణయాన్ని తమ విద్యార్థి సంఘం వ్యతిరేకిస్తున్నదని చిరంజీవి తెలిపారు. ఆయన వెంట శ్రీనివాస్, శివప్రసాద్, తదితరులు ఉన్నారు.

భూ సమస్యలపై వినతి



లింగాల: మండలంలోని అప్పాయపల్లిలో సోమవారం నిర్వహించిన భూ భారతి గ్రామ సభలో భూములకు సంబంధించిన అనేక సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకున్నారు. పాసు బుక్కులలో భూ విస్తీర్ణం తక్కువగా నమోదు కావడం, విరాసతులు, కొత్త పాసు బుక్కులు రాక పోవడం, భూముల కొనుగోళ్లు, అమ్మకాలు తదితర సమస్యలపై 100 వరకు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణాజీ, మండల సర్వేయర్ రాంబాబు, ఆర్‌ఐ తిర్పతమ్మ, జూనియర్ అసిస్టెంట్లు సతీష్, సతీష్‌నాయక్, రమేష్ పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులని తహసీల్దార్ ఇబ్రహీం తెలిపారు. సోమవారం గుండూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 49 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో రవూఫ్, రోహిత్ రెడ్డి, శేఖర్, విష్ణు, హరీష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి

కందనూలు: ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి ప్రసాద్ అన్నారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు పాఠశాలల దోపిడీ రోజురోజుకు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు పెంచుతున్న ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ, ప్రదీప్, వెంకటేష్, పాల్గొన్నారు.

ఫోటోరైటప్(16ఎన్‌జికెఎల్72: డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

కార్మిక వ్యతిరేక చట్టాలను అంగీకరించం

తాడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను అంగీకరించేది లేదని ఏఐటీయూసీ నాయకులు శివశంకర్ అన్నారు. మండల కేంద్రంలో తాపీ కార్మికుల చలో హైదరాబాద్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, భవన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సత్యం, క్రిష్ణయ్య, తిరుపతయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి భూమిపూజ



కల్వకుర్తి రూరల్: ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కల్వకుర్తి నియోజకవర్గంలో ఎంతోమంది నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలో ఇద్దరు పేదలకు ఇంటి నిర్మాణం కోసం సోమవారం భూమిపూజ చేశారు. సూర్యలత కార్మిక సంఘం గుర్తింపు అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు బావండ్ల మధు మాట్లాడారు. ఉప్పల వెంకటేష్ సేవలు అమూల్యమైనవన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం, గణేష్, భగత్ సింగ్, అల్లుడు కృష్ణ, గంధం ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఆదర్శం

కల్వకుర్తి రూరల్: నేటి కాలంలో అప్పు చేసి చాలామంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు సైతం తమ పిల్లలను ప్రైవేటులోనే చేర్పిస్తున్నారు. ఈ సందర్భంలో మార్చాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అందరికీ ఆదర్శంగా నిలిచాడు. తమ కుమారుడిని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతిలో చేర్పించాడు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని, ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటరమణ మాట్లాడుతూ అందరూ శ్రీనివాసులును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, శ్రీనివాసులు, నారాయణ, యాదయ్య, తదితరులు ఉన్నారు.

మైనింగ్ అనుమతి రద్దు చేయాలి



చారకొండ: మండలంలోని సీర్సనగండ్ల గ్రామంలో సర్వే నంబర్ 182లో బ్లాక్ గ్రానేట్ తవ్వకాలను నిలిపేసి, అనుమతులు రద్దు చేయాలని సోమవారం సిర్సనగండ్ల రైతులు, గ్రామస్తులు మండల కేంద్రంలోని తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులకు సమాచారం లేకుండా మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం సరైంది కాదని, చట్ట విరుద్ధమన్నారు. బ్లాక్ గ్రానైట్ తవ్వకాలు చేపట్టడంతో జరిగే నష్టాలను వివరించారు. వ్యవసాయ పొలాలు, కోళ్ల ఫారాలు, పశుసంపద, పంటల నష్టం, కాలుష్యం తదితర వాటిని దృష్టిలో పెట్టుకోని బ్లాక్ గ్రానైట్ తవ్వకాలను నిలిపేసి, అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.